ప్రభుత్వానికి పట్టదా..!

బాసర వేదపాఠశాలలో బీసీ విద్యార్థులపై దాడులు • 50 రోజులు పూర్తయినా దర్యాప్తులో లేని పురోగతి • రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

ప్రత్యేక ప్రతినిధి, మే 8(నమస్తే తెలంగాణ): పవిత్ర పుణ్యక్షేత్రం బాసరలో అపవిత్ర కార్యకలాపాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఆంధ్రా నుంచి కొన్నేండ్ల క్రితం వచ్చిన వేద విద్యానందగిరి స్వామీజీ కారణంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు బాసర క్షేత్ర వైభవాన్ని మసక బారుస్తున్నాయి. అక్కడి శ్రీ వేద భారతీపీఠం పాఠశాలలో ఇద్దరు బీసీ విద్యార్థులపై వరుస దాడులు భక్తులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మార్చి 19న అర్ధరాత్రి పాఠశాలలో జరిగిన దాడిలో లోహిత్ అనే విద్యార్థి తీవ్రగాయాలపాలై కోమాలోకి వెళ్లాడు. గాయపడిన లోహిత్‌ను చూసిన మణికంఠ అనే మరో విద్యార్థి ఏప్రిల్ 4న విద్యుదాఘాతంతో అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. ఈ రెండు ఘటనలు జరిగి 50రోజులు పూర్తి కావస్తున్నా, కేసుల్లో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మల్ జిల్లా కలెక్టర్ సహా జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్, దేవాదాయ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రతి చిన్న విషయానికి స్పందించి ఆగమేఘాలపై చర్యలు తీసుకునే కలెక్టర్ అభిలాష అభినవ్.. బాసరలో జరుగుతున్న ఈ ఘోరకలిపై నోరు మెదపకపోవడం, ఇప్పటి దాకా విచారణ చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తున్నది. వేద పాఠశాలలో చేరిన పేద పిల్లలతో స్వామీజీ వెట్టి చాకిరీ చేయించుకుంటారని.. అసలు ఇక్కడ వేదాలు నేర్పించడం కన్నా ఇతరత్రా కార్యకలాపాలే ఎక్కువగా ఉంటాయని

ఆ పాఠశాలలో వేద గురువుగా పనిచేసిన ఉజ్జయినికి చెందిన పంకజ్ తెలిపారు. వేద పాఠశాల నిర్వహణ సక్రమంగా లేని కారణంగానే తాను రాజీనామా చేసి వెళ్లిపోయినట్లు చెప్పారు. స్వామీజీ అసలు పేరు, అడ్రస్ కూడా తెలియకుండా నకిలీ చిరునామా, కొత్త పేరుతో ఈ ప్రాంతంలో చెలామణి అవుతున్నారని ఓ పోలీస్ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

అనుమతి లేకుండా మైనర్లతో నిర్వహణ

వరుస ఘటనలతో చర్చనీయాంశంగా మారిన బాసరలోని శ్రీవేదభారతీ పాఠశాల నిబంధనలను పాటించడంలేదని తెలిసింది. మైనర్లతో పాఠశాల నిర్వహించాలంటే జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ పాఠశాలకు అలాంటివి అనుమతులేవీ లేవని పోలీసులే చెప్తున్నారు. లోహిత్ గాయాలతో పడి ఉన్నప్పుడు పాఠశాలలో 53 మంది విద్యార్థులుంటే అందులో 20 మంది మైనర్లే ఉన్నట్టు తెలిసింది. మైనర్లను వెంటనే ఇంటికి పంపాలని పోలీసులు చెప్తే, వారితోపాటు మిగిలిన విద్యార్థులను కూడా నిర్వాహకులు ఇంటికి పంపారు. అందరినీ పంపిన నిర్వాహకులు మణికంఠను మాత్రం వెళ్లనివ్వలేదు. ఈ విషయాన్ని మణికంఠ స్వయంగా ఫోన్‌లో తన కుటుంబసభ్యులకు చెప్పాడు. విచారణ నుంచి తప్పించుకోవడంలో భాగంగానే అందరినీ ఇంటికి పంపి, మణికంఠను గోదాట్లోకి పంపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రవేశం నిషిద్ధం

విద్యార్థులపై దాడుల అనంతరం వేదపాఠశాల నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలోకి ఎవరూ వెళ్లకుండా గేట్లకు తాళాలు వేశారు. పదిరోజుల క్రితమే సెక్యూరిటీ గార్డును పెట్టారు. వేద పాఠశాల నిర్వాహకుడైన విద్యానందస్వామి ఎవరితోనూ మాట్లాడం లేదు. ఏం మాట్లాడాలన్నా స్వామీజీ శిష్యులతో ఏర్పాటు చేసిన కమిటీతోనే మాట్లాడాలని చెప్పి పంపించేస్తున్నారు.

కొండెంగ దాడి కాదు..

అటవీశాఖ అధికారులు

లోహిత్‌పై కొండముచ్చు దాడి చేసిందని పాఠశాల నిర్వాహకులు దవాఖానలో వైద్యులకు, పోలీసులకు చెప్పారని తెలిసింది. కానీ అటవీశాఖ, వన్యప్రాణుల నిపుణులు దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. లోహిత్ గాయపడిన తీరును ఫొటోలో చూసిన అధికారులు అది కొండముచ్చు దాడి కానేకాదని తేల్చిచెప్తున్నారు. కొండముచ్చు గోర్లు అంత పదునుగా ఉండవని, అది గిచ్చితే గీరినట్టు పైపై గాయాలు మాత్రమే అవుతాయని, అంతలోతుగా దిగవని స్పష్టం చేస్తున్నారు. పైగా, ఒక మనిషిని గట్టిగా పట్టి అంతగా గాయపరిచే అవకాశమే లేదని అంటున్నారు. ఎలుగుబంటి దాడిచేస్తే మాత్రం ఆ స్థాయిలో గాయాలు అయ్యే అవకాశం ఉందని చెప్తున్నారు. అయితే, బాసర ఎఫ్‌ఆర్‌వో వేణుగోపాల్‌ను వివరణ కోరగా అసలు ఆ ప్రాంతంలో ఎలుగుబంట్ల కదలికలు లేవని చెప్పారు.

కీలక సాక్షి మృతి

లోహిత్ కేసులో కీలక సాక్షి, సహచర విద్యార్థి బండారి మణికంఠ. గాయాలపాలై, రక్తపు మడుగులో పడి ఉన్న లోహిత్‌ను ముందుగా చూసింది అతడే. ఆ రోజు రాత్రి పాఠశాలలో ఏం జరిగిందో తెలిసే అవకాశం ఉన్న ఏకైక వ్యక్తి మణికంఠ. కానీ ఏప్రిల్ 4న విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. గోదావరి ఘాట్‌ను శుభ్రం చేసేందుకు మణికంఠను ఆశ్రమ నిర్వాహకులే బలవంతంగా నీళ్లలోని మోటర్ దగ్గరకు పంపించారని తెలుస్తున్నది. మణికంఠ మోటర్ దగ్గర ఉండగానే స్విచ్ ఎవరు వేశారనేది తేలలేదు. మరోవైపు, మణికంఠ కేసులో ముగ్గురు యువతులు సాక్షులుగా ఉన్నారని పోలీసులు చెప్తున్నారు. అంత ఉదయం ఆ అమ్మాయిలు అక్కడికి ఎందుకు వచ్చారు? అక్కడ వారు ఏం చేస్తున్నారు? అన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ఏప్రిల్ 4న తెల్లవారుజామున 4గంటలకు మణికంఠ గోదావరి నీటిలోకి వెళ్తుంటే చూశామని, అతడు కరెంట్ షాక్‌తోనే చనిపోయాడని వాళ్లు చెప్పినట్టు పోలీసులు తెలిపారు. కానీ అదే సమయంలో పుష్కరఘాట్‌లో ఉన్న మాతాజీ తండ్రి, ఆయన మనవడు, పాఠశాలకు చెందిన మరొకరిని సాక్షులుగా ఎందుకు చూడలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అన్ని కోణాల్లో విచారిస్తున్నాం

వేద పాఠశాలలో విద్యార్థిపై దాడి, మరో విద్యార్థి మృతి కేసులను పారదర్శకంగా విచారిస్తున్నాం. లోహిత్ కేసులో ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నది వాస్తవం. కోలుకున్న లోహిత్ ఏమైనా చెప్తాడా? అని ఎదురుచూస్తున్నాం. కానీ తను ఏం చెప్పడంలేదు. లోహిత్ అన్ని విషయాలు చెప్తున్నాడు. కానీ సరిగ్గా ఆ రోజు సాయంత్రం ఏం జరిగిందంటే తనకు గుర్తులేదని, ఏం జరగలేదని చెప్తున్నాడు. అందుకే కేసు పెండింగ్‌లోనే ఉండిపోయింది. మణికంఠ మృతి కేసులో ప్రత్యక్ష సాక్షులు ఉన్నారు. వాళ్లు ఎక్కడి నుంచి వచ్చారు? అనే కోణంలో విచారిస్తున్నాం. కేసులో చాలా అనుమానాలున్నాయి. అన్ని కోణాల్లో విచారిస్తున్నాం.

-జానకీ షర్మిల, నిర్మల్ జిల్లా ఎస్పీ

విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలి

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సేవలను అందించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల పోస్టులకు ఎంపికైన 121మంది అభ్యర్థులకు సచివాలయంలో నియామక పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేసి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరీక్షల వైపు మొగ్గు

- **ఎస్ఎల్‌బీసీపై రాష్ట్ర సర్కారు నిర్ణయం**
- **నేడు నిపుణుల సబ్ కమిటీ సమావేశం**

హైదరాబాద్, మే8 (నమస్తే తెలంగాణ): నిపుణుల సలహాలు, సాంకేతిక పరీక్షలు నిర్వహించిన అనంతరమే ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) టన్నెల్ పనులపై ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అధ్యయనాలు ఏవీ లేకుండా ముందుకెళ్లొద్దనే అభిప్రాయానికి వచ్చింది. ఆయా అంశాలపై చర్చించేందుకు శుక్రవారం టెక్నికల్ సబ్ కమిటీ సభ్యుల సమావేశాన్ని ప్రత్యేక ఏర్పాటుచేసింది. ప్రమాద ఘటనపై అధ్యయనం చేసేందుకు, సహాయ చర్యలను ముమ్మరం చేసి ఆరుగురు కార్మికుల మృతదేహాలను త్వరితగతిన వెలికితీసేందుకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం చేసి.. సిఫారసులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 12మందితో ఒక టెక్నికల్ కమిటీని నియమించింది. పర్యావరణ మంత్రిత్వ శాఖ విధించిన షరతుల మేరకు అధ్యయనం చేసి పనుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సాంకేతిక నిపుణులతో మరో ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. సొరంగ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైనింగ్, ఫ్యూయల్ రీసెర్చ్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ నుంచి నిపుణులతో కూడిన ఉప-కమిటీని ఏర్పాటుచేసింది.

'ఇందిరా సౌరగిరి జలవికాసం'పై కసరత్తు

- **అచ్చంపేట నియోజకవర్గంలో 18న ప్రారంభం**
- **ఏర్పాట్లపై భట్టి సమీక్ష**

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరులో ఈ నెల 18న 'ఇందిరా సౌరగిరి జలవికాసం' పథకం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం కింద కేటాయించిన భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రూ.12,600 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఐదేండ్లలో 2.10 లక్షల మంది గిరిజన రైతులకు చెందిన 6 లక్షల ఎకరాలకు ఈ పథకం ద్వారా సాగునీటి వసతి కలుగుతుందని తెలిపారు.

లెక్చరర్ల క్రమబద్ధీకరణ అసాధ్యం

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకుల క్రమబద్ధీకరణ అసాధ్యమని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి స్పష్టంచేశారు. 13రోజులుగా సమ్మె చేస్తున్న అధ్యాపకుల సంఘాల ప్రతినిధులతో జరిపిన చర్చల్లో ఈ విషయాన్ని తేల్చిచెప్పారు. సాంకేతికంగా క్రమబద్ధీకర ణ సాధ్యంకాదని, న్యాయస్థానాలలో నిలబడదని వెల్లడించారు. చర్చల అనంతరం సమ్మెను విరమిస్తున్నట్టు అధ్యాపక సంఘాల జేఏసీ నేత ధర్మతేజ ప్రకటించారు. కాంట్రాక్టు అధ్యాపకులను తొలగిస్తే ఏర్పడే సమస్యలు, వారికి ఉద్యోగ భద్రత కల్పన, 7వ వేతన సవరణ సంఘం ప్రకారం జీతాలు, డీఏ, ఇంక్రిమెంట్ పెంపు ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదిక పంపించామని ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. కానీ తుది నిర్ణయం ప్రభుత్వమే తీసుకుంటుందని చెప్పారు.

ఆధార్ ఒక్కటే ప్రామాణికం కాదు

- **ఓటర్ఐడీ, డ్రైవింగ్ లైసెన్సులు ఓకే**
- **ఎక్స్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి**

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆర్టీసీ కల్పించే ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి 'జీరో టికెట్' తీసుకోవడానికి ఆధార్‌కార్డు ఒక్కటే ప్రామాణికం కాదని ఆర్టీసీ ఎండీ వీ సీ సజ్జనార్ ఎక్స్ వేదికగా ఓ నెటిజెన్‌కు సమాధానం ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఒరిజినల్ ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి తదితర గుర్తుంపు కార్డులను ప్రయాణ సమయంలో కండక్టర్లకు చూపించి జీరో టికెట్‌ను పొందొచ్చని చెప్పారు. ముదావత్ రమేశ్ నాయక్ అనే నెటిజన్ 'తెలంగాణలో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు జీరో టికెట్ కోసం ఆధార్ ఉంటే చాలా? కచ్చితంగా అప్‌డేటెడ్ ఆధార్ కావాలా? దయచేసి నిర్ధారించండి' అంటూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను ట్యాగ్ చేశారు. దీనికి ఎండీ పై విధంగా సమాధానం ఇచ్చారు. సజ్జనార్ సమాధానికి రమేశ్‌నాయక్ స్పందిస్తూ.. తన పాప 6వ ఏట అడుగుపెట్టిందని, కొన్ని కారణాల వల్ల ఆధార్ అప్‌డేట్ చేయించుకోలేదని తెలిపారు. ఇదే విషయాన్ని కండక్టర్లకు చెబితే.. వినలేదని వాపోయాడు. 'సార్ మీరే మైనా ఆధార్ కార్డు నంబర్‌ను టికెట్‌పై ఎంట్రీ చేయడం లేదు కదా?' అని కండర్లను ప్రశ్నించినా వారు టికెట్ కొట్టారని చెప్పాడు.

డ్రోన్ టెక్నాలజీతో కచ్చితమైన ఫలితాలు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): డ్రోన్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యాన ఉత్పత్తిలో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చని ఆచార్య కొండా లక్ష్మణ్ ఉద్యా న విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. పంటలపై పరిశోధన, అభివృద్ధి, శిక్షణలో సహకారానికి ఉద్యాన వర్సిటీ, మారుత్ డ్రోన్స్ సంస్థ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ములుగు ఉద్యాన వర్సిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజిరెడ్డి, మారుత్ డ్రోన్స్ సంస్థ ప్రతినిధి పరస్పరం ఒప్పంద సంతకాలు చేశారు.

బ్యాంకులకు మేము గ్యారెంటీ!

- **మహిళా సంఘాలకు రుణాలకు బ్యాంకర్లు సహకరించాలి**
- **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క**
- **రూ.19,838 కోట్ల రుణాల లక్ష్యంగా యాక్షన్ ప్లాన్**

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): మహిళా సంఘాల తరపున తాము బ్యాంకులకు గ్యారెంటీ ఇస్తున్నామని, వాళ్లు తీసుకొనే ప్రతి పైసాను చెల్లిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి సీతక్క హామీ ఇచ్చారు. యాక్షన్‌ప్లాన్‌కు అనుగుణంగా మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకర్ల సహకరించాలని కోరారు. 98.5శాతం రుణాలను రీపే చేసి మహిళా సంఘాలు రికార్డు సృష్టించినట్టు గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గురువారం పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) వార్షిక యాక్షన్ ప్లాన్ 2025-26 కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని 3,55,138 స్వయం సహాయక సంఘాలకు రూ.19,838.58 కోట్ల బ్యాంకు రుణాల మంజూరు లక్ష్యంగా సెర్ప్ వార్షిక యాక్షన్‌ప్లాన్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు బ్యాంకుల రుణాలు ఎగవేస్తున్నారని, సూటుబూట్లతో కనిపించి ముంచుతున్నారని ఆరోపించారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఈ సంఘాలు ఉపాధి స్థాయి నుంచి సంపద సృష్టించే స్థాయికి ఎదిగాయని, పదిమందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత సమాచార దీపికను మంత్రి విడుదల చేశారు. పీఆర్‌ఆర్డీ కార్యదర్శి లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, బ్యాంకర్లు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎవరేమన్నా మూసీ ప్రక్షాళన చేస్తాం

- **ఆక్రమణలను నిర్మూలిస్తాం**
- **ఫామ్‌హౌస్‌ల మురుగంతా తాగునీటిలో కలుస్తున్నది**
- **హైడ్రా పోలీస్‌స్టేషన్, వెబ్‌సైట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): ఎవరేమనుకున్నా, ఎంతమంది వ్యతిరేకించినా సరే ఆక్రమణదారులను నిర్మూలిస్తామని, మూసీ ప్రక్షాళన తప్పకుండా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్ ప్రజలకు తాగునీటిని అందించే జంట జలాశయాల్లోకి చుట్టూ ఉన్న ఫామ్‌హౌస్‌ల నుంచి మురుగు వచ్చి చేరుతున్నదని పేర్కొన్నారు. లేక్‌వ్యూ ఫేస్‌తో చెరువుల పక్కనే కొందరు ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని, వరద నీరు ప్రవహించాల్సిన నాలాలపై ఇల్లు, అపార్ట్‌మెంట్లు వెలిశాయని, అలాంటివారందరికీ హైడ్రా భయం పట్టుకున్నదని పేర్కొన్నారు. చెరువుల, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసమే హైడ్రాను తీసుకొచ్చామని స్పష్టంచేశారు. సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో ఏర్పాటుచేసిన హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు హైడ్రా కోసం కొనుగోలు చేసిన 21 డీఆర్‌ఎఫ్ ట్రక్స్, 55 స్కార్పియోలు, 4 ఇన్నోవా క్రిస్టా, 5 మినీబస్సులు, 37 ద్విచక్ర వాహనాలు కలిపి మొత్తం 122 వాహనాలను ప్రారంభించారు. అనంతరం హైడ్రా వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన తప్పకుండా చేస్తామని, అక్కడి ప్రజలు ఆ మురికి కూపంలోనే మగ్గిపోవాల్నా? అని ప్రశ్నించారు. చిన్న గాలి వాన వస్తేనే కాలనీలకు రోజుల తరబడి కరెంట్ ఇవ్వలేని పరిస్థితి ఉన్నదని, చెట్లు నేలకూలుతున్నాయని, కరెంట్ స్తంభాలు విరిగిపోతున్నాయని, వీటిని వెంటనే పునరుద్ధరించడానికి హైడ్రా పనిచేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో ఎలాగైనా రియల్‌ఎస్టేట్‌ను పెంచుదామనుకుంటే, నాలుగు వందల ఎకరాల్లో చెట్టన్నారు, పుట్టన్నారు, ఇంకేదో చెప్పి అడ్డుకున్నారని పేర్కొన్నారు. ప్రజల వద్దకు ప్రజాప్రతినిధులను పంపి మూసీపై ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంబంధాలు మెరుగుపర్చుకోండి

డీజీపీ జితేందర్

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో రాణించాలంటే ప్రజా సంబంధాలను మెరుగుపరుచుకోవాలని డీజీపీ జితేందర్ పోలీస్ అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అసిస్టెంట్ ఎస్పీలు, ట్రైనీ అసిస్టెంట్ ఎస్పీల పనితీరును తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. పోలీస్‌శాఖ ద్వారా ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ బేసిక్ పోలీసింగ్‌ను మర్చిపోవద్దని సూచించారు. మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల అడిషనల్ డీజీ మహేశ్ ఎం భగవత్, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, వీ సత్యనారాయణ, శాంతిభద్రతల ఏఐజీ రమణకుమార్, అసిస్టెంట్ ఎస్పీలు బీ చైతన్య, ఆర్ రాహుల్‌రెడ్డి, కాజల్, అవినాష్‌కుమార్, శివ ఉపాధ్యాయ, చేతం నితిన్, శుభం, పీ మౌనిక, శేషాద్రినిరెడ్డి, వసుంధరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం సోమారపుకుంటతండాలో ఇందిరమ్మ ఇండ్ల విచారణకు వచ్చిన అధికారులను నిలదీస్తున్న గిరిజన ప్రజలు

బడా నాయకుడి అనుచరులకేనా?

- **ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలెలా?**
- **అధికారులపై సోమారపుకుంట తండావాసుల మండిపాటు**

తొర్రూరు, మే 8 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం సోమారపుకుంటతండా వాసులు అధికారులపై మండిపడ్డారు. విచారణ నిమిత్తం గురువారం తండాకు వచ్చిన డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్య, తండా కార్యదర్శి గుగులోత్ రాజును గ్రామస్థులు నిలదీశారు. సోమారపుకుంట తండాకు మంజూరైన 10 ఇందిరమ్మ ఇండ్లను 5 నుంచి 7 ఎకరాల భూమి కలిగిన కాంగ్రెస్ నేతలకే కేటాయించారని, నిజంగా ఇండ్లు లేని పేద గిరిజనులకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బడా నాయకుడి కింద పనిచేసే వర్గానికి కూడా ఇండ్లు కేటాయించారని గిరిజనులు ఆరోపించారు. 'ఇందిరమ్మ కమిటీ ఎప్పుడు ఏర్పాటు చేశారు? సభ్యులెవరు? ఎంపిక ఏ ఆధారంగా చేశారో చెప్పండి' అంటూ తండావాసులు అధికారులను నిలదీశారు. వారికి సమాధానం ఇవ్వలేక డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్య, కార్యదర్శి గుగులోత్ రాజు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సీట్ల పెంపు నిర్ణయాధికారం ప్రభుత్వానిదే

- **ఇంజినీరింగ్, ఇతర కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు**
- **రాజకీయ వివక్షతో తిరస్కరించినట్టు ఆధారాల్లేవని వెల్లడి**



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ ఇంజినీరింగ్, ఇతర కాలేజీల్లో సీట్ల పెంపుదల, కోర్సుల విలీనానికి ఏఐసీటీఈ, జేఎన్టీయూ ఆమోదం తెలిపినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ పలు ఇంజినీరింగ్ కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. సీట్ల పెంపు, కోర్సుల విలీనానికి సంబంధించి నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నదని స్పష్టంచేసింది. ఏఐసీటీఈ, జేఎన్టీయూ ఆమోదం మేరకు సీట్ల పెంపు, కోర్సుల విలీనానికి ప్రభుత్వం అనుమతించకుండా వాటి దరఖాస్తులను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ ఎంజీఆర్, సీఎంఆర్, కేఎంఆర్, మల్లారెడ్డి, మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, మారుతి తదితర కాలేజీల యాజమాన్యాలు దాదాపు పది పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరించారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు ఎస్ నిరంజన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి తదితరులు వాదనలు వినిపిస్తూ.. గత ప్రభుత్వంతో అనుబంధం ఉన్న కారణంగానే తమ కాలేజీల దరఖాస్తులను ప్రస్తుత ప్రభుత్వం తిరస్కరించిందని ఆరోపించారు. అదనపు సీట్ల వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక ప్రభావం ఉండదని వివరించారు. దీనిపై ప్రభుత్వ తరపు న్యాయవాది సమాధానమిస్తూ.. ప్రైవేట్ విద్యాసంస్థల మధ్య సమానత్వాన్ని, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల అవసరాలు, స్థానిక పరిస్థితులు అన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నదని చెప్పారు. సరైన సామర్థ్యం లేని ఇంజినీర్లు, అవసరానికి మించి విద్యార్థులు బయటికి వస్తున్నారని పేర్కొన్నారు. సిటీ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఇంజినీరింగ్ కాలేజీల్లో అదనపు సీట్ల భర్తీకి అనుమతిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడుతున్నాయని పేర్కొన్నారు. గతంలో సీట్ల పెంపునకు అవకాశం ఇచ్చిన కాలేజీలకు తిరిగి అదనంగా తీసుకోవడానికి అనుమతించడంలేదని, ఇందులో వివక్ష ఏమీ లేదని తెలిపారు. తిరస్కరణకు ఎలాంటి రాజకీయ కారణాలు లేవని కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తూ కండ్లకోయ, మేడ్చల్ మల్కాజిగిరి ప్రాంతాల్లోని ప్రైవేట్ కాలేజీల్లో ఖాళీలు, అడ్మిషన్లపై వివరాలను పరిశీలించిన తరువాతే ప్రభుత్వం దరఖాస్తులను తిరస్కరించిందని పేర్కొన్నారు. సీట్లు పెంపు, కోర్సుల విలీనం ఎందుకు అవసరమన్న దానికి కాలేజీలు ఆధారాలు చూపలేదని తెలిపారు. అంతేకాకుండా, ఏఐసీటీఈ ఒక్కరోజులోనే కాలేజీల తనిఖీ పూర్తి చేయగా, నిపుణుల కమిటీ సమగ్ర తనిఖీ నిర్వహించి, మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది, సాంకేతిక, లైబ్రరీ, కంప్యూటర్లు, ఇతర వివరాలను సమర్పించిందని స్పష్టంచేశారు. ఆర్టికల్-226 కింద కోర్టుల న్యాయసమీక్ష పరిమితమని, ప్రభుత్వపరంగా విధాన నిర్ణయం తీసుకునే ప్రక్రియ సక్రమంగా జరిగిందో లేదో మాత్రమే కోర్టు పరిశీలిస్తుందని స్పష్టంచేశారు. వాస్తవాంశాలపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల విషయంలో కోర్టు అప్పిలేట్ అథారిటీగా వ్యవహరించదని పేర్కొన్నారు. చట్టప్రకారం కాకుండా ఏకపక్షంగా నిర్ణయం ఉన్నప్పుడే కోర్టులు తమ విచక్షణాధికారాన్ని వినియోగించి జోక్యం చేసుకుంటాయని తెలిపారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణపై వివరణ ఇవ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): వేసవి సెలవుల్లో ప్రైవేట్ కాలేజీలు తరగతులు నిర్వహించడంపై వివరాలు సమర్పించాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. వేసవి సెలవుల్లో ప్రైవేట్ కాలేజీలు తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలంటూ న్యాయవాది బీ క్రాంతికుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ఇంటర్‌బోర్డు ప్రకటించిన విద్యా క్యాలెండర్‌కు విరుద్ధంగా కాలేజీలు భౌతిక, ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయని వివరించారు. నిరంతర విద్యాబోధనతో నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారని వివరించారు. అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఏ ప్రైవేట్ జూనియర్ కళాశాల కూడా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడం లేదని చెప్పారు. దీంతో సెలవుల్లో తరగతుల నిర్వహణపై వివరణ ఇవ్వాలని విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది.

కాంగ్రెస్‌లోకి వస్తేనే ఇందిరమ్మ ఇండ్లా?

- **ప్రొసీడింగ్స్ కాపీలు ఇచ్చినంక ఇండ్లు కట్ చేస్తారా?**
- **బీఆర్ఎస్ కార్యకర్తలైతే ఇండ్లు ఇయ్యరా?**

అమ్రాబాద్, మే 8 : పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చి ఆ తరువాత ఎంపిక జాబితాలో నుంచి పేర్లు తొలగించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని తుర్కపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కావడం వల్లే ఇండ్లు మంజూరు చేయడం లేదని కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా చెప్పడం గమనార్హం. అయితే సదరు బాధితులు సైతం ఇండ్లు లేకపోయినా పర్వాలేదు కానీ తాము బీఆర్ఎస్‌ను వీడేది లేదంటూ స్పష్టం చేయడం గమనార్హం. వివరాలు ఇలా.. తుర్కపల్లి గ్రామానికి చెందిన ఆర్మూర్ లక్ష్మమ్మ, సంగీ బాలమ్మకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఇటీవల ప్రొసీడింగ్ పత్రాలు కూడా అందజేశారు. తాజాగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జాబితాలో నుంచి వారి పేర్లను తొలగించారు. విషయం తెలుసుకున్న సదరు మహిళలు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తుర్కపల్లికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తుర్కపల్లిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి ఫొటోలతో ఉన్న ప్రొసీడింగ్ పత్రాలను అందించిన తర్వాత లిస్టులో పేరు రాలేదని పేర్కొన్నారు. ఇదే విషయమై వారు కాంగ్రెస్ పెద్దలను అడిగితే.. 'మీరు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారు కాదు. అందువల్ల మీ పేర్లు లిస్టులో లేవు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారితే మీకు ఇండ్లు ఇస్తాం' అని చెప్పినట్టు బాధితులు లక్ష్మమ్మ, బాలమ్మ గువ్వల దృష్టికి తీసుకొచ్చారు. తమకు ఇండ్లు ఇవ్వకపోయిన పర్వాలేదని, బీఆర్ఎస్‌లోనే ఉంటామని చెప్పారు.

తుర్కపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌ను చూపుతున్న బాలమ్మ